క్లుప్తంగా

19న జిల్లా స్థాయి చెస్ పోటీలు

సాక్షి, భీమవరం: అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అలయన్స్ క్లబ్ సహకారంతో ఈనెల 19న భీమవరం కిడ్జీప్లేస్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి అండర్–15 చెస్ పోటీలు నిర్వహించనున్నట్టు చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాదాసు కిషోర్, గమిని పవన్ శుక్రవారం తెలిపారు. వివరాలకు సెల్ 90632 24466లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకోడేరు: పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ రంగమనాయుడు ఆధ్వర్యంలో విస్సాకోడేరు జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వెయిట్, హైట్, రక్త పరీక్షలు నిర్వహించి తక్కువ రక్తశాతం ఉన్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. మునగాకు, కరివేపాకు, నువ్వులు– బెల్లం, వేరుశనగ, మినప సున్నుండుల, ఖర్జూరాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్స్ కె.ఎ శ్రీనివాస్, నాగమణి, లలిత, వాణి, వై గోపాలకృష్ణ, ఏఎన్ఎంలు, హెచ్ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ర్యాలీ

భీమవరం అర్బన్: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పి.సత్యనారాయణరాజు అన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామంలో శుక్రవారం టీబీ వారోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండు వారాల పైబడి దగ్గు, జ్వరం, ఛాతి నొప్పి, దగ్గినప్పుడు కఫం పడిన లక్షణాలు కనబడితే వెంటనే ఉమ్మి పరీక్ష చేయించుకోవాలని, ఈ వ్యాధి పట్ల అశ్రద్ధ వహిస్తే ప్రాణాపాయం స్థితికి చేర్చుతుందని సత్యనారాయణరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో టీబీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆర్ విద్యానందం, సూపర్‌వైజర్ ఎస్.వరప్రసాద్, కె.చంద్రారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమాజహితం కోరుతూ ప్రార్థనలు



సువార్త సభలో మాట్లాడుతున్న బ్రదర్ అనిల్‌కుమార్

ఉండి: సమాజ సంక్షేమం కోసం కులమతాలకు అతీతంగా అందరి క్షేమం కోసం క్రైస్తవులంతా తప్పక దేవుని ప్రార్థించాలని అంతర్జాతీయ ప్రసంగీకుడు బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు గ్రామంలో పెనుయేలు ప్రెయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాస్టర్స్ రెవరెండ్ ఈదా విజయ్‌ప్రసాద్, రెవరెండ్ దాయం సునీత నిర్వహిస్తు 18వ వార్షికోత్సవ సువార్త మహాసభలకు ముఖ్య ప్రసంగీకుడుగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ మనతోటి వారికి మంచి చేయాలంటే ముందుగా మనం మంచితనాన్ని నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్రాధ్యక్షుడు మేడిద జాన్సన్, వివిధ గ్రామాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు.

అదుపు తప్పి దుకాణాల్లోకి దూసుకెళ్లిన లారీ

తణుకు: మండలం పైడిపర్రు ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక లారీ అదుపు తప్పి దుకాణాల్లోకి దూసుకెళ్లింది. గుంటూరు నుంచి కాటన్‌బేళ్ల లోడుతో తణుకు వస్తున్న లారీ స్థానిక బస్టాండు ఎదురుగా రోడ్డులోకి వెళ్లే క్రమంలో అదుపు తప్పి దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాక పోగా పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఇదిలా ఉంటే క్లీనర్ మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లేగ దూడల ఎదుగుదలతోనే పశు సంపద వృద్ధి

యలమంచిలి: లేగదూడల సమగ్ర ఎదుగుదలతోనే పశు సంపద వృద్ధి చెందుతుందని పశు సంవర్ధక శాఖ భీమవరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జవర్ హుస్సేన్ చెప్పారు. యలమంచిలి సెంటర్‌లోని తమ్మినీడి నరసింహారావు లేఅవుట్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన లేగ దూడల ప్రదర్శన, పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేగ దూడ పుట్టిన వెంటనే ముర్రిపాలు తాగించాలన్నారు. దీని వల్ల దూడలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దూడ పుట్టిన తరువాత 10వ రోజున నట్టల నివారణ చేయించాలన్నారు. గోమర్లు, అంతర పరాన్నజీవులు దూడల జోలికి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. అనంతరం లేగ దూడలకు అందాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. శిబిరానికి దూడలను తీసుకు వచ్చిన రైతులందరికీ ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ పాలకొల్లు డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ మేడా రామశేకర్, యలమంచిలి, దొడ్డిపట్ల పశు వైద్య కేంద్రాల వైద్యులు డాక్టర్ దొమ్మేటి మాధురి, డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబువి దగాకోరు రాజకీయాలు

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



సమావేశంలో పాల్గొన్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు

సాక్షి, భీమవరం: ప్రతిపక్షనేత నారా చంద్రబాబు నాయుడు దగాకోరు రాజకీయాలను గడగడపకు వెళ్లి వివరించాలని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక ఏఎంసీ ఆవరణలో భీమవరం టుటౌన్ పరిధిలోని వైఎస్సార్‌సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా తమ ఆరాధ్యదైవంగా భావిస్తుండగా, ముఖ్యమంత్రిపై కొన్ని మీడియా సంస్థల ద్వారా బురదజల్లడం సరికాదని అన్నారు. ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతానికిపైగా అమలు చేశారని, ఇవ్వని హామీలను సైతం అమలుచేస్తూ ప్రజల హృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని వివరించారు. రానున్న ఎన్నికల్లో తిరిగి జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్న కృతనిశ్చయంతో ప్రజలున్నారని తెలిపారు. టీడీపీకి రాజకీయ భవిష్యత్తు శూన్యమని అర్థమైన చంద్రబాబు జనసేన నేత పవన్‌కల్యాణ్‌ను అడ్డుపెట్టుకుని ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన లేని పవన్‌కల్యాణ్ చంద్రబాబుకు వంతపాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపైనా, సీఎం జగన్‌పైనా అసత్య ఆరోపణల చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గా నాగమల్లేశ్వరరావు (బాబు), డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, టుటౌన్, త్రీటౌన్ జేసీఎ కన్వీనర్స్ గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు (తాతరాజు), చెల్లబోయిన సూర్యప్రకాష్, రాష్ట్ర గౌడ, రజక కార్పొరేషన్ డైరెక్టర్స్ కామన నాగేశ్వరరావు, రేవూరి గోగురాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు, పార్టీ నాయకులు తోట భోగయ్య, కోడె యుగంధర్, కొల్లి ప్రసాద్, కొట్టి కుటుంబరావు, మునగాల నర్సింహమూర్తి, అల్లూరి రాజేష్, ఎం.మురళి, ముత్యాల బుజ్జి, చిగురుపాటి సందీప్, సాగి విజయ కృష్ణంరాజు, బాల జ్యోతి మూర్తి, నల్లం రాంబాబు, పేరిచర్ల సత్యనారాయణరాజు, కందికట్ల ఎడ్వర్డ్, బొక్కా సూర్యకుమారి, చొప్పల లిల్లీగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సహాయ కేంద్రంలో మరిన్ని సేవలకు కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బలరాం

భీమవరం (ప్రకాశం చౌక్): అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో మరిన్ని వైద్య సేవల్ని అందించేందుకు, విస్తృత పరిచేందుకు కృషి చేస్తామని కేంద్రం చైర్మన్ బి.బలరాం అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో వైద్య సహాయ కేంద్రం ఏర్పాటు చేసి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఈ కేంద్రంలో ల్యాబ్, ఈసీజీ, 2డీ ఎకో, పరీక్షలతో పాటు జనరిక్ మందులు అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఈ నెల 26న బీపీ, షుగర్, పక్షవాతం, ఫిట్స్ సంబంధింత వైద్య శిబిరం నిర్వహిస్తామని, ఈ నెల 28న గుండె పరీక్షలు, వైద్య సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జానకి రామరాజు, కేంద్రం కన్వీనర్ వి.రాధా కృష్ణ, ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్ మేనేజర్ వై.రణదేవ్, వైద్య సహాయ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌బీ మహాసభలను విజయవంతం చేయాలి

సాక్షి, భీమవరం: ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) 19వ జాతీయ మహాసభల విజయవంతానికి కృషి చేయాలని ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక కృష్ణమూర్తి పేర్కొన్నారు. మహాసభలు సన్నాహాల్లో భాగంగా శుక్రవారం భీమవరంలో దండు శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభలకు 35 దేశాల నుంచి సౌహార్ద ప్రతినిధులు, దేశంలోని 26 రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది ప్రతినిధులు హాజరవుతున్నట్టు చెప్పారు. దేశంలోని రాజకీయ పరిస్థితులపై చర్చిస్తారని తెలిపారు. సమావేశంలో బొడ్డు వెంకటేశ్వరరావు, నడింపల్లి హరినాధరాజు, వాటాల రాంబాబు, మోకా పరమేశ్వరావు, పెచ్చెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి డస్ట్‌బిన్ల అందజేత



సోమేశ్వరస్వామి దేవస్థానానికి డస్ట్ బిన్లను అందిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ఆలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత భక్తులపై ఉందని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కృష్ణ చైతన్య, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కోడే విజయలక్ష్మి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా డస్ట్ బిన్లను శుక్రవారం అందజేశారు. నిర్వాహకుడు రంగసాయి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో ఎస్అర్‌కేఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ తరుపున యాజమాన్యం నిశాంత్ వర్మ ఆర్థిక సాయంతో రెండు ఆలయాలకు డస్ట్ బిన్లు, పినాయిల్, బ్రష్‌లు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు నాచు శ్రీవల్లి, నల్లం రఘుబాబు, భీమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గ్రంధి వెంకటరావు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ప్రజారోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. పున్నాని శివశక్తికి రూ.70 వేలు, మంచాల దానయ్య కుటుంబానికి రూ.25 వేలు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇతర రాష్ట్రాల్లోని ఆసుపత్రుల్లోనూ కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించే ఏర్పాటు చేశారని, వైఎస్సార్ ఆరోగ్య శ్రీపథకంలో 3,500కు పైగా వ్యాధులకు ఉచిత వైద్యం అందిస్తున్నారని వివరించారు. వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

ఫ్యామిలీ డాక్టర్‌కు మంచి స్పందన



దొంగపిండిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సత్యనారాయణరాజు

భీమవరం అర్బన్: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ (ఫ్యామిలీ డాక్టర్) పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు ఉచిత వైద్యం అందిస్తున్నామని, దీనికి మంచి స్పందన వస్తోందని వైద్యాధికారి పి.సత్యనారాయణరాజు అన్నారు. భీమవరం మండలం దొంగపిండి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్స్ పథకంలో భాగంగా శుక్రవారం రోగులకు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఆరోగ్య పట్ల అశ్రద్ధగా ఉన్న వారిని గుర్తించి ఫ్యామిలీ డాక్టర్స్ కార్యక్రమంలో చికిత్స అందిస్తున్నామని చెప్పారు. 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్ మల్లాడి నారాయణరావు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ డ్రైవ్‌డాక్ స్టార్టర్‌తో ఎంవోయూ



ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి సలాది దీపు ప్రారంభించిన డ్రైవ్‌డాక్ స్టార్టర్‌తో కళాశాల ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ మేరకు పత్రాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు కంపెనీ ప్రతినిధి ఎస్.సుధాకర్‌రాజు శుక్రవారం మార్చుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ కె.బ్రహ్మరాజు మాట్లాడుతూ దీపు కళాశాలలోని ఆటోమోటివ్ క్లబ్లులో పనిచేశాడని, జర్మనీలో ప్రముఖ సంస్థలో పని చేస్తున్నప్పటికీ తన స్వగ్రామం మల్కిపురంలో రెండేళ్ల క్రితం స్టార్టర్ ప్రారంభించి మరో ప్లాంట్‌ను భీమవరం ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. ఆటోమొబైల్ వాహనాల బ్యాటరీలు తయారీ, డ్రై బ్యాటరీలను తిరిగి బాగుచేయడంతోపాటు గోకార్ట్ వంటి వెహికల్స్‌ని కూడా తయారుచేసే విధంగా ఈ స్టార్టర్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఇందులో తమ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటెన్‌షిప్ కూడా అందించనున్నారన్నారు. కార్యక్రమంలో టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్ గోపాలకృష్ణమూర్తి, కంపెనీ మార్కెటింగ్ విభాగం రిప్రజెంటేటివ్ లాస్య, మెకానికల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వేగేశ్న మురళీకృష్ణమరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భూముల రీ సర్వే



కోలనపల్లిలో భూ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కాళ్ల: జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా శుక్రవారం కాళ్ల మండలం కోలనపల్లి, ప్రాతాళ్లమెరక గ్రామాల్లో భూముల సర్వే నిర్వహించారు. దీనిలో భాగంగా సర్వే చేసేందుకు డ్రోన్ ఫ్లై చేశారు. కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇండియా సిబ్బంది, తహసీల్దార్ టీపీ కృష్ణారావు, ఆర్ఐ రాఘవమూర్తి రాజు, వీఆర్వో సాయి, ఎంపీటీసీ సభ్యులు వేగేశ్న సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

గరగపర్రులో

పాలకోడేరు: మండలంలోని గరగపర్రు గ్రామంలో శుక్రవారం రి సర్వే పై డ్రోన్ ఫ్లయింగ్ నిర్వహించారు. పాలకోడేరు తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఆర్ఐ నాగభూషణం నాయుడు, వీఆర్వో స్వామినాయుడు పాల్గొని సర్వేను పర్యవేక్షించారు. రైతులు గ్రామస్తుల సమక్షంలో సర్వే నిర్వహించారు.

ఆర్థిక అక్షరాస్యతే అభివృద్ధికి మూలం



పాములపర్రులో ఆర్థిక అక్షరాస్యత పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న నాబార్డ్ డీడీఎం అనిల్‌కాంత్

ఉండి: ఆర్థిక అక్షరాస్యతే మనిషిని అభివృద్ధి పథంలోకి నడిపిస్తుందని నాబార్డ్ డీడీఎం అనిల్‌కాంత్ అన్నారు. శుక్రవారం ఉండి మండలం పాముపర్రు, కలిసిపూడి గ్రామాల్లో ఎస్ఎస్‌టీ సంస్థ, ఆర్‌బీఐ వారి సహకారంతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కాంత్ మాట్లాడుతూ సామాన్యుడు కూడా అభివృద్ధి చెందేందుకు ప్రధాన మార్గం పొదుపు అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎల్‌డీఎం రమణ, ఆర్‌ఓ సురేష్, ఎస్ఎస్‌టీ సంస్థ కౌన్సిలర్ ఎరిచెర్ల గ్లాడ్సన్, బెల్హాజర్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి మోక్ష మార్గోపదేశ సభలు

భీమవరం అర్బన్ : భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు మోక్ష మార్గోపదేశ సభలు నిర్వహించనున్నట్టు రెవరెండ్ విల్లూరి పద్మకుమార్ శుక్రవారం తెలిపారు. సభలకు ముఖ్యఅతిథులుగా ఏపీ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్, ప్రముఖ పాస్టర్లు హాజరవుతారని పేర్కొన్నారు. విశ్వాసులంతా పాల్గొని సభలను విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలి

కాళ్ల: ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతీ విద్యార్థి సద్వినియోగపరచుకుని విద్యలో రాణించాలని సమగ్ర శిక్ష జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ తెలిపారు. కాళ్ల మండలం కోపల్లే గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గ్రామంలోని భవిత సెంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



ఆకివీడులోని రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం



శక్తీశ్వర ఆలయంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

ఆకివీడు: మహా శివరాత్రి సందర్భంగా పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. గణపతి పూజ, హోమం పలు దేవాలయాల్లో శుక్రవారం నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో గణపతి హోమం నిర్వహించారు. పార్వతీ సమేత వెంకటలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మార్కండేయేశ్వరస్వామి ఆలయంలోనూ, పెదకాపవరంలోని కుసుమేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతి కల్యాణం వైభవంగా చేశారు. క

కలిసిపూడిలో..

ఉండి: శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు పార్వతీ సమేత మల్లికార్జునుడి గ్రామోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉండి, కలిసిపూడి, చిలుకూరు, యండగండి, ఉప్పులూరు, కోలమూరు, మహదేవపట్నం తదితర గ్రామాల్లో గ్రామోత్సవాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాలను నిర్వహించారు.ఈ

వీరవాసరంలో..

వీరవాసరం: మహా శివరాత్రి పర్వదినానికి మండలంలోని శైవ క్షేత్రాలన్నీ సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలకంరించారు భక్తులు ఇబ్బంది కలగకుండా క్యూలైన్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి మండలంలోని శివాలయాల్లో స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణాలను తిలకించారు.

భీమవరంలో..

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో కొలువై ఉన్న ఎంతో పురాతన ప్రాశస్తి కలిగిన శ్రీ పార్వతి సమేత శక్తీశ్వరస్వామి ఆలయంలో శనివారం మహా శివరాత్రిని పురస్కరించుకుని ఏర్పాట్లను పూర్తి చేశారు. చలువ పందిళ్లతోనూ లేజర్ లైటింగ్‌తోను ఆలయ ప్రాంగణం సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పనసకర్ల మురళీకృష్ణ తెలిపారు.